క్లుప్తంగా

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన నేడు

డాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు జరిగే ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. భక్తులు యూనియన్ బ్యాంక్ అకౌంట్ నంబరు 060810011006681 టౌన్ కొత్తరోడ్డు బ్రాంచి, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ చేస్తారు. పూర్తి వివరాలకు 0891–2711725, 2566514 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని ఆలయ అధికారులు కోరారు.

ఘనంగా మోదకొండమ్మ తొలేళ్ల ఉత్సవం


చలువతోటలో అలంకరణలో మోదకొండమ్మ

అల్లిపురం: చలువతోటలో వెలసిన శ్రీ మోదకొండమ్మ అమ్మవారి తొలేళ్ల ఉత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి అమ్మవారికి భక్తులు పూజలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. మంగళవారం అమ్మవారి ప్రధాన జాతర అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం నుంచి పూజలు నిర్వహిస్తామని తెలిపారు. సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తరించాలని కమిటీ సభ్యులు కోరారు.

‘కొత్త కోర్సులు ప్రవేశపెట్టడం తగదు’

డాబాగార్డెన్స్: ఉన్నత విద్యా సంస్థలు, విశ్వవిద్యాలయాల్లో సిలబస్, పాఠ్యాంశాలకు సంబంధించి సంబంధిత చట్టబద్ధమైన కౌన్సిల్ ఆమోదం లేకుండా కొత్త కోర్సులు ప్రవేశపెట్టడం సమర్థనీయం కాదని భారత ప్రభుత్వ ప్రత్యేకాధికారి జి.సత్యనారాయణ అభిప్రాయపడ్డారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భారత సాంప్రదాయ విద్యా విధానం ప్రకారం ఉన్నత విద్యా వ్యవస్థలో నియమాలు, పాఠ్యాంశాలు, సిలబస్‌లు నిర్ణయించే భారత ప్రభుత్వ సంస్థలు మాత్రమే యూజీ/పీజీ/పీహెచ్‌డీ విద్యార్థుల ఉత్తీర్ణతను నిర్ణయించడానికి అర్హులన్నారు. ఉన్నత విద్యా సంస్థలు, విశ్వ విద్యాలయాల్లో ప్రవేశం పొందిన బ్యాచిలర్, మాస్టర్స్, డాక్టర్, డిగ్రీ విద్యార్థులకు యూజీసీ, వారి చట్టబద్ధమైన కౌన్సిల్ నిర్వహించే డిగ్రీ ఫైనల్ పబ్లిక్ పరీక్షలకు హాజరు, ఉత్తీర్ణత తప్పనిసరన్నారు. యూజీసీ జారీ చేసిన డిగ్రీ పాస్ సర్టిఫికెట్ ఉత్తీర్ణతకు రుజువుగా పరిగణిస్తారని చెప్పారు.

అప్పన్న సన్నిధిలో సంగీత దర్శకుడు రవిశంకర్


కప్పస్తంభానికి మొక్కుకుంటున్న రవిశంకర్

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని సోమవారం సినీ సంగీత దర్శకుడు రవిశంకర్ దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆయన పేరిట అర్చకులు స్వామికి పూజలు నిర్వహించి స్వామివారి ప్రసాదం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 2008లో ప్రియమణి, శరత్‌కుమార్,కృష్ణంరాజు ప్రధాన పాత్రల్లో విడుదలైన చండీ సినిమా ద్వారా సంగీత దర్శకుడిగా పరిచయం అయినట్టు తెలిపారు. బాలీవుడ్‌లో అమితాబచ్చన్ నటించిన సర్కార్–3, తెలుగులో నాగార్జున హీరోగా విడుదలైన ఆఫీసర్ సినిమాతో పాటు కోలీవుడ్‌లో డాక్టర్ శివరాజ్‌కుమార్‌తో కిల్లింగ్ వీరప్పన్ అనే సినిమాకు సంగీత డైరెక్టర్‌గా పనిచేశానన్నారు. ప్రస్తుతం ప్యాన్ ఇండియా మూవీగా వస్తున్న రామజన్మభూమి, వరదరాజుగోవిందం అనే సినిమాకు సంగీతం సమకూర్చినట్టు తెలిపారు.

సద్గుణాల సందేశమే బక్రీద్

- త్యాగం, ప్రేమ, సహనాలను చాటిచెప్పే పండగ
- మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు


ప్రార్థనల అనంతరం శుభాకాంక్షలు తెలియజేసుకుంటున్న ముస్లింలు

అల్లిపురం: త్యాగానికి ప్రతీకగా నిలిచిన బక్రీద్ పండగను సోమవారం నియోజకవర్గంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. ఉదయం నుంచి మసీదులు, ఈద్గాలలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. నియోజకవర్గంలో అల్లిపురం, చలువతోటలో గల మసీదు వద్ద, రిజర్వ్‌లైన్ మసీదు, కోటవీధి మసీదు, జగదాంబ దరి మక్కా మసీదు, ఏవీఎన్ కళాశాలలో గల మసీదు వద్ద ప్రార్థనలు చేపట్టారు. ఇబ్రహీం భక్తికి, త్యాగానికి గుర్తుగా ప్రపంచ వ్యాప్తంగా ముస్లింలు ఈ పండగ జరుపుకుంటారని మతపెద్దలు వివరించారు. అనంతరం ముస్లింలంతా తమ పెద్దల సమాధుల వద్ద ఇష్టమైన ఆహార పదార్థాలు, పువ్వులు ఉంచి ప్రార్థనలు చేపట్టారు. ఒకరికొకరు బక్రీద్, ఈద్ ముబారక్ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.



ఈద్ ముబారక్ తెలియజేసుకుంటున్న ముస్లింలు

కేజీహెచ్‌లో రోగులకు మెరుగైన సేవలందించాలి


మాట్లాడుతున్న కలెక్టర్ మల్లికార్జున, చిత్రంలో ఎమ్మెల్యే వంశీకృష్ణ, తదితరులు

మహారాణిపేట: ఉత్తరాంధ్రలో పేద ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందిస్తున్న కింగ్ జార్జ్ ఆస్పత్రిలో రోగులకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించేందుకు విభాగాధిపతులు, వైద్యులు కృషి చేయాలని విశాఖ దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ యాదవ్ సూచించారు. కలెక్టర్ మల్లికార్జునతో కలిసి కేజీహెచ్ విభాగాధిపతులు, వైద్యులతో సోమవారం పరిచయ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వంశీకృష్ణ మాట్లాడుతూ కేజీహెచ్‌కు వచ్చే ప్రతీ రోగికి సంతృప్తికరంగా వైద్య సేవలు అందించి సహకరించాలని కోరారు. ఆస్పత్రి అభివృద్ధికి ప్రభుత్వం నుంచి మరింత సహకారం అందిస్తామని తెలిపారు. అనంతరం కలెక్టర్ మల్లికార్జున మాట్లాడుతూ కేజీహెచ్‌లో సీఎస్‌ఆర్ నిధులతో పలు అభివృద్ధి పనులు చేపట్టి పూర్తి చేశామన్నారు. ఇంకా వివిధ దశల్లో ఉన్న పనులను త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. వైద్యులంతా సమయపాలన పాటిస్తూ పేద ప్రజలకు మంచి వైద్య సేవలు అందించాలని కోరారు. సమావేశంలో కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానందం, ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు, ఏపీఎంఎస్ఐడీసీ ఈఈ బి.ఎ.నాయుడు, అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్ కుమార్, ఆర్ఎంవో డాక్టర్ డి.భాస్కరరావు, వైద్యాధికారులు, ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.

కూరగాయల ధరల మోత


సీతమ్మధార రైతుబజార్‌లో టమాటా స్టాల్

సీతమ్మధార: వేసవి సీజన్ ముగుస్తున్న తరుణంలో కూరగాయల ధరలు ఒక్కసారిగా పెరగడంతో వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రధానమైన పండగలు లేని ఈ నెలలోనే కూరగాయల ధరలు ఇలా ఉంటే.. వచ్చే నెల ఇంకెంత పెరుగుతాయోనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలకు పలు ప్రాంతాల్లో పంటలు దెబ్బతిని దిగుబడులు తగ్గి, డిమాండ్ పెరిగిన కారణంగా ధరలు పెరుగుతున్నాయని భావిస్తున్నారు. టమాటా తదితర కూరగాయల ధరలు ఆకాశన్నంటుతున్నాయని విచారం వ్యక్తం చేస్తున్నారు. పలు రకాల కూరగాయల ధరల కిలో రూ.50 పైమాటే పలకడం గమనార్హం. రైతుబజార్‌లో సోమవారం కిలో టమాటా ధర రూ.52 పలికింది. గత వారం రూ.44గా ఉంది. అల్లం ప్రస్తుతం రూ.170 పలుకుతోంది. కాకరకాయల ధర రూ.30 నుంచి రూ.50కు పెరిగింది. దొండకాయలు కిలో రూ.24 నుంచి రూ.40కు, పచ్చిమిర్చి రూ.50 నుంచి రూ.60, క్యాప్సికమ్ రూ.70 నుంచి రూ.90కు పెరిగింది. ఉల్లిపాయల ధర కిలో రూ.35 పలుకుతోంది.

బహిరంగ మార్కెట్‌లోనూ రెక్కలు..

రైతుబజార్, పూర్ణా మార్కెట్, జ్ఞానాపురం హోల్‌సేల్ మార్కెట్‌లో కూడా కూరగాయల ధరలు భగ్గుమంటున్నాయి. బహిరంగ మార్కెట్‌లో టమాటా ధర రూ.60 నుంచి రూ.70 పలుకుతోంది. ఉల్లిపాయల ధర రూ.40 నుంచి రూ.50, దొండకాయల ధర రూ.50 నుంచి రూ.60 వరకు ఉంది.


ట్రాలర్ ఆగిపోవడంతో జాతీయ రహదారిపై తాళ్లవలస వద్ద రైలింజన్

జాతీయ రహదారిపై రైలింజన్

తగరపువలస: భీమిలి మండలం తాళ్లవలస జాతీయ రహదారిపై సోమవారం ఒక భారీ ట్రాలర్ సాంకేతిక కారణాలతో నిలిచిపోయింది. తమిళనాడు నుంచి కోల్‌కత్తా వైపు ఈ ట్రాలర్ రైలింజన్‌ను తీసుకుని వెళ్తోంది. మధ్యలో మొరాయించడంతో ట్రాలర్‌ను అక్కడే నిలిపివేసి దాని ఇంజిన్‌ను మరమ్మతులకు తరలించారు. రహదారిపై ఆగిపోయిన రైలింజిన్ వద్ద వాహనదారులు ఆగి సెల్ఫీలు తీసుకుని మురిసిపోయారు.

సింహగిరి.. ఆధ్యాత్మిక ఝరి

- అప్పన్నకు వైభవంగా ఆర్జిత సేవలు
- తరలి వచ్చిన భక్తులు


సహస్రనామార్చన చేస్తున్న అర్చకుడు

సింహాచలం: సింహగిరికి భక్తులు పోటెత్తారు. ఆధ్యాత్మిక చింతనలో మునిగి తేలారు. అప్పన్న ఆర్జిత సేవల్లో పాల్గొని తరించారు. అనంతరం స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం ఆర్జిత సేవలు వైభవంగా నిర్వహించారు. ఉదయం 9.30 గంటల నుంచి నిత్యకల్యాణం వైభవంగా చేశారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ ఆస్థాన మండపంలోని వేదికపై అధిష్ఠింపజేశారు. విష్వక్సేనపూజ,పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం నేత్ర పర్వంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సహస్రనామార్చన ఘనంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను బేడామండపంలోని వేదికపై అధిష్ఠింపజేసి 1001 నామాలు పఠిస్తూ స్వామికి తులసితో అర్చన చేశారు.
- సింహాచలేశుడికి గరుడసేవ వైభవంగా జరిగింది. ఆలయ బేడామండపంలో స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని వెండి గరుడవాహనంపై వేంచేయజేసి అష్టోత్తరశతనామావళి పూజ చేశారు. విశేషంగా హారతులు అందజేశారు.పూజలో పాల్గొన్న భక్తులను గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు.


నిత్యకల్యాణంలో పాల్గొన్న భక్తులు

ఇష్టారాజ్యంగా పార్కింగ్‌తో ఇబ్బందులు


జోన్ - 5లో సౌకర్యం కేంద్రం వద్ద ఇష్టారాజ్యంగా పార్కింగ్ చేసిన వాహనాలు

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం జోన్ – 5 జోనల్ కార్యాలయంలో సౌకర్యం కేంద్రం వద్ద ఇష్టారాజ్యంగా వాహనాలు పార్కింగ్ చేయడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇంటి పన్నులు, మంచినీటి పన్నులు, ఇతర సేవలు వినియోగించుకోవడానికి ఇక్కడకు పలువురు వస్తుంటారు. పార్కింగ్ స్థలం వద్దే నగదు చెల్లింపుల కౌంటర్ ఉండడంతో వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఆన్‌లైన్‌లో ఇబ్బందులు తలెత్తితే గంటల కొద్దీ నిరీక్షించాల్సి వస్తోంది. సౌకర్యం కేంద్రం వద్ద జోన్ – 5 సిబ్బందే అడ్డదిడ్డంగా తమ ద్విచక్ర వాహనాలు పార్కింగ్ చేస్తున్నారు. వాహనాలు కేంద్రానికి దూరంగా పార్కింగ్ చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

వైభవంగా పైడిమాంబ తొలేళ్ల సంబరం


పైడిమాంబ అమ్మవారి ప్రతిమలు ఊరేగిస్తున్న భక్తులు

కంచరపాలెం: ఐటీఐ జంక్షన్ పరిధి సంకురపేటవాసుల ఆరాధ్య దైవం పైడిమాంబ అమ్మవారి తొలేళ్ల ఉత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి ప్రతిమల ఊరేగింపును కనులపండువగా జరిపించారు. గ్రామాధ్యక్షుడు పిల్లి మురళి నేతృత్వంలో అమ్మవారి తొలి ప్రతిమకు పూజలు చేసి, ఘటాల ఊరేగింపు ప్రారంభించారు. సాయంత్రం 4 గంటలకు ప్రారంభమైన ఈ ఉత్సవంలో అమ్మవారి ప్రతిమలను దొండపర్తి, జగదాంబ, అల్లిపురం, కాన్వెంట్ కూడలి, జ్ఞానాపురం, రామ్మూర్తిపంతులపేట, కంచరపాలెం నేతాజీ ఫ్లైఓవర్, ఊర్వశి కూడలి మీదుగా ఊరేగించి, ఐటీఐ జంక్షన్‌లోని ఆలయం ఆవరణలో అమ్మవారి ప్రతిమలను నిలిపారు. అనంతరం అమ్మవారి ఘటాలకు పుట్ట బంగారం వద్ద పూజారి చంద్రశేఖర్ ప్రత్యేక పూజలు చేశారు. తొలేళ్ల ఉత్సవంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. నేలవేషధారణలు ఆకట్టుకున్నాయి. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా పోలీసులు చర్యలు చేపట్టారు.

నేడు ప్రధాన జాతర

మంగళవారం ప్రధాన జాతరను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉత్సవ ఏర్పాట్లను గ్రామ కమిటీ పాలకవర్గ సభ్యులు రమణ, శంకర్, రాము, సూరిబాబు, సముద్రాలు, తంగేటి శ్రీను, కుమార్, అప్పలరాజు పర్యవేక్షించారు.

జోరుగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు


వాహనదారులను తనిఖీ చేస్తున్న పోలీసులు

సీతమ్మధార: ద్వారకా జోన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో సోమవారం సాయంత్రం డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. ఎస్ఐ భాస్కరరావు ఆధ్వర్యంలో పోలీసులు వాహన చోదకులను తనిఖీ చేశారు. సాయంత్రం వేళల్లో పలువురు వాహన చోదకులు మద్యం తాగి వాహనాలు నడుపుతూ రోడ్డు ప్రమాదాలకు కారణమవుతున్నారు. ఈ నేపథ్యంలో కొంతకాలంగా ఆయా ప్రాంతాల్లో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు జోరుగా నిర్వహిస్తున్నారు. ఫలితంగా నగరంలో రోడ్డు ప్రమాదాల సంఖ్య గణనీయంగా తగ్గిందని పోలీసు ఉన్నతాధికారులు చెబుతున్నారు. స్థానిక పొలాక్ స్కూల్, గురుద్వారా, ద్వారకానగర్, అల్లూరి సీతారామరాజు జంక్షన్ తదితర కూడళ్ల వద్ద పోలీసులు వాహన చోదకులకు డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్‌లు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ భాస్కరరావు మాట్లాడుతూ వాహన చోదకులు విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించి పోలీసు శాఖకు సహకరించాలని కోరారు. మద్యం తాగి వాహనాలు నడపడం తోటి ప్రయాణికులకు కూడా ప్రమాదకరమని హెచ్చరించారు.

దళితులకు పథకాలు అమలు చేయాలి


అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న కుల వివక్ష పోరాట సమితి సభ్యులు

డాబాగార్డెన్స్: దళితులకు సంబంధించి నిలిపివేసిన పథకాలను వెంటనే అమలు చేయాలని కుల వివక్ష పోరాట సమితి సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం డాబాగార్డెన్స్ అంబేడ్కర్ విగ్రహం వద్ద జీవో 596 రద్దు చేయాలని, ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు సక్రమంగా అమలు చేయాలని కోరుతూ వినూత్న రీతితో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా కేవీపీఎస్ విశాఖ జిల్లా కమిటీ ప్రధాన కార్యదర్శి తిరుకోటి చిరంజీవి మాట్లాడుతూ విదేశీ విద్య, బెస్ట్ అవైలబుల్ స్కూల్స్, కులాంతర వివాహాల ప్రోత్సాహం, ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. దళితుల భూములు దళితులకే ఇవ్వాలని, దళితుల భూములకు రక్షణ కల్పించాలన్నారు. జీవో 596 రద్దు చేయాలని, దళిత గిరిజన గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ విశాఖ జిల్లా ఉపాధ్యక్షుడు వై.రాజు, ఎం.సుబ్బారావు, శేఖర్, నర్సింగరావు, సరోజిని, తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా విశ్వేశ్వరస్వామి కల్యాణం


విశ్వేశ్వరస్వామి, బాలత్రిపుర సుందరి కల్యాణం

డాబాగార్డెన్స్: నగరంలోని సూర్యాబాగ్ మెయిన్‌రోడ్డులో కొలువుదీరిన విశ్వేశ్వరస్వామి ఆలయంలో వార్షిక కల్యాణోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా మండపారాధన, త్రిశూల పూజ చేశారు. మహిళలు లలిత, విష్ణు సహస్రనామ పారాయణం చేపట్టారు. సాయంత్రం వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ విశ్వేశ్వరస్వామికి, బాల త్రిపుర సుందరీదేవికి కల్యాణం జరిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ మేనేజర్ దేవుళ్లు, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా దుర్గమ్మ సారె ఊరేగింపు


దొండపర్తిలోని సారె ఊరేగింపులో భక్తులు

సీతమ్మధార: జీవీఎంసీ 27వ వార్డు దొండపర్తిలోని శ్రీదుర్గమ్మ ఉత్సవాలలో భాగంగా సోమవారం సారె ఊరేగింపు ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు పుర వీధుల్లో అమ్మవారికి సారెను ఊరేగింపుగా తీసుకెళ్లి సమర్పించారు. రాత్రి తొలేళ్ల ఉత్సవం ఘనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి ఉత్సవాల సందర్భంగా చుట్టుపక్కల ప్రాంతాల్లో సందడి వాతావరణం నెలకొంది. వీధులను విద్యుద్దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు అల్లూరి సత్యనారాయణరెడ్డి, కారాల మహేష్, చిరంజీవి, పాలికల సింహాచలం, గురునాథరెడ్డి, టి.లలితాకుమార్, వెంకటేశ్వరరెడ్డి, ఈశ్వరరెడ్డి, కుమార్, సతీష్, ఆశిష్, అల్లూరి నాగేంద్రరెడ్డి, బొక్క సత్యనారాయణరెడ్డి, వెంకన్న, వంశీ, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

‘ఆర్థిక రాజధానిగా విశాఖ’ ప్రకటనపై హర్షం


కూటమి నాయకులను సత్కరిస్తున్న సత్యనారాయణ

డాబాగార్డెన్స్: విశాఖ నగరాన్ని ఆర్థిక రాజధానిగా అభివృద్ధి చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించడం హర్షణీయమని మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ అన్నారు. నగరంలోని ఓ ఫంక్షన్ హాల్లో సోమవారం ఉత్తర నియోజకవర్గంలో కూటమి అభ్యర్థి విజయానికి కృషి చేసిన టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులతో తెలుగునాడు రజక ఫెడరేషన్ యూనియన్ ఆత్మీయ సమావేశం నిర్వహించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. జనసేన మహిళా నాయకురాలు పసుపులేటి ఉషాకిరణ్‌తో పాటు ఆయా పార్టీల నాయకులను ఘనంగా సత్కరించారు. యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ చీపురుపల్లి వెంకట సత్య స్వరూప్, పెబ్బిలి రవికుమార్, రాజమండ్రి నారాయణ, హేమ, వసంత్, ధర్మా, భాస్కర్, రమణ, ఎల్లంకి కృష్ణ, రాజబాబు, సాగర్, తదితరులు పాల్గొన్నారు.

జాబ్ మేళాకు విశేష స్పందన



జాబ్‌మేళాకు హాజరైన విద్యార్థులు



మేళాలో అభ్యర్థులనుద్దేశించి మాట్లాడుతున్న కృష్ణా కళాశాల ప్రిన్సిపాల్ విజయబాబు

మద్దిలపాలెం : డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో జవహర్ నాలెడ్జ్ సెంటర్, మ్యాజిక్ బస్ ఫౌండేషన్ సంయుక్తంగా సోమవారం నిర్వహించిన మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. ఈ జాబ్‌మేళాకు 1230 మంది రిజిస్ట్రేషన్ చేసుకుని ఇంటర్వ్యూలకు హాజరయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు తెలిపారు. వారిలో 364 మంది వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు పొందారన్నారు. మేళాకు సమన్వయకర్తగా జవహర్ నాలెడ్జ్ సెంటర్ కో ఆర్డినేటర్ జి.శ్రీనివాసరావు, మ్యాజిక్ బస్ ఫౌండేషన్ ప్లేస్‌మెంట్ కో–ఆర్డినేటర్ రాజు మేళా విజయవంతానికి కృషి చేశారన్నారు. ఇలాంటి క్యాంపస్ డ్రైవ్‌లను మరిన్ని కళాశాల వేదికగా నిర్వహించాలని ఆయన కోరారు.

భూమిని కాపాడే బాధ్యత మనదే



పర్యావరణ పోస్టర్లు ప్రదర్శిస్తున్న విద్యార్థులు, పీఆర్ గార్డెన్స్ యూత్, జేవీ రత్నం టీం సభ్యులు

మద్రిపాలెం: భూమిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని గ్రీన్ క్లైమేట్ టీం ఎన్‌జీవో వ్యవస్థాపక కార్యదర్శి జేవీ రత్నం అన్నారు. 49వ వార్డు పట్టాభిరెడ్డి తోటలో పట్టాభిరెడ్డి గార్డెన్స్ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ పర్యావరణ మాసోత్సవాల్లో భాగంగా సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మన భూమిని మనమే కాపాడుకోవాలని, ప్రతి ఒక్కరూ ప్రకృతి ఆధారిత పంటలు పండించిన ఆహారాన్నే ఆరగించాలన్నారు. విశాఖలో అమలవుతున్న ఎకో వైజాగ్‌లో భాగంగా మొక్కలు నాటి, వాటిని పెంచి విజయవంతం చేయాలని కోరారు. అడ్వకేట్ సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఈ ఏడాది నుంచి ప్రతి ఏటా 500 మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. అందరూ పర్యావరణ హితంగా జీవించాలని పిలుపునిచ్చారు. విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించాలన్నారు. సంస్థ కార్యదర్శి శ్రీనివాసరావు మాట్లాడుతూ పట్టాభిరెడ్డి తోట అనే పేరు నిలబెట్టేందుకు తమ ప్రాంతానికి చెందిన వారందరినీ కలిపి ఒక పథకం ప్రకారం పచ్చని తోటగా తీర్చిదిద్దుతామన్నారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు కోటేశ్వరరావు, కోశాధికారి గణేష్, సహాయ కార్యదర్శి సంతోష్, పలువురు విద్యార్థులు పాల్గొని మాట్లాడారు.